


తెలుగు ఉపాధ్యాయుల పోస్టులు తీసేయడం తగదు

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

పాఠశాలల పునర్వ్యవస్థీకరణలో భాగంగా 1 నుంచి 8వ తరగతి వరకు ఉండే ప్రాథమికోన్నత పాఠశాలల్లో తెలుగు బోధించే ఉపాధ్యాయుల పోస్టులను తీసివేయడం తగదని రాష్ట్ర భాషోపాధ్యాయ సంస్థ (ఎస్ ఎల్ టి ఏ) జిల్లా అధ్యక్షులు దొడ్డ ఉమామహేశ్వర్, జిల్లా ప్రధాన కార్యదర్శి సిబ్బాల కిరణ్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత ప్రభుత్వం తెలుగు మాధ్యమానికి మంగళం పలికి ఆంగ్ల మాధ్యమం, సీబీఎస్ఈ సిలబస్ అమలు చేయగా ప్రస్తుత పాలకులు విమర్శించారని, ప్రస్తుతం పాఠశాల విద్యాశాఖలో అదే తంతు నడుస్తుంటే తెలుగు మాధ్యమం లేదని ఉత్తర్వులు ఇవ్వడం శోచనీయమని పేర్కొన్నారు. జాతీయ విద్యా విధానం -2020 ప్రకారం ఐఐటి ,ఎంబీబీఎస్ కోర్సులను తెలుగులో బోధించాలనే నిబంధన ఉన్నా పాలకులు పట్టించుకోవడంలేదని విమర్శించారు. తమిళనాడు, కర్ణాటక తదితర రాష్ట్రాల్లో మాతభాషకు పెద్ద పీట వేస్తుంటే ఇక్కడ పట్టించుకోవడంలేదని ఆక్షేపించారు.

విశ్వరూప దర్శనం



వెల్లివిరిసిన 'మతసామరస్యం'



జీవకోనలో గంగమ్మకు ముస్లింల 'సారె'

ముగిసిన గంగమ్మ జాతర

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ జాతర బుధవారం విశ్వరూప దర్శనంతో ముగిసింది. తెల్లవారుజామున భక్తులు పెద్ద సంఖ్యలో గంగమ్మ ఆలయానికి విచ్చేశారు. చివరిరోజు ఆలయం ముందు గంగమ్మ విశ్వరూపాన్ని ప్రతిబింబించే విగ్రహాన్ని ఏర్పాటు చేస్తారు. కైకాల వంశస్థులు గంగమ్మ చెంప నరికి భక్తులపై మట్టిని విసురుతారు. ఈ చర్యతో జాతర ముగుస్తుంది. మట్టిని తీసుకోడానికి పెద్ద సంఖ్యలో భక్తులు కిక్కిరిసారు. మట్టిలో ఔషధ గుణాలు ఉంటాయని భక్తుల నమ్మకం. గంగమ్మ ఆలయానికి పాలకమండలి లేకపోవడంతో 27 మందితో ఉత్సవ కమిటీని ఏర్పాటు చేసి, పర్యవేక్షణ బాధ్యతలను కమిషనర్ ఎన్.మౌర్యకు అందజేశారు. జాతర నిర్వహణను పరిశీలిస్తూ సిబ్బందికి ఆదేశాలు జారీ చేసి జయప్రదంగా ముగిసేలా చేశారు. అయితే చివరిరోజు జేబు దొంగలు తమ చేతివాటాన్ని ప్రదర్శించారు. ఈ ఏడాది ముస్లింలు జీవకోనలో గంగమ్మకు 'మతసామరస్యం వెల్లివిరిసేలా' సారెను సమర్పించడం హైలెట్‌గా నిలిచింది.

తాతయ్య గుంట గంగమ్మ జాతర విశ్వరూపం చెంప నరికే కార్యక్రమం బుధవారం తెల్లవారుజామున అమ్మవారు విశ్వరూప దర్శన అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. స్థానిక ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు కుటుంబసమేతంగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. తిరుపతి టిడిపి మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ , తిరుపతి టిడిపి పార్లమెంట్ అధ్యక్షులు నరసింహ యాదవ్,అదేవిధంగా నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్. మౌర్య, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ తమ కుటుంబసభ్యులతో వేర్వేరుగా అమ్మవారిని దర్శించుకున్నారు. ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారి సేవలో పాల్గొన్నారు

ఊపిరి పీల్చుకున్న అధికారులు

తాతయ్య గుంట గంగమ్మ జాతర సాంప్రదాయ పద్ధతిలోవిజయవంతంగా నిర్వహించడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. దేవదాయ శాఖ, టీటీడీ, మున్సిపల్ కార్పొరేషన్, ఎస్పీడీసీఎల్, తుడా, ఆర్ అండ్ బి ఇతర ప్రభుత్వ శాఖలు సమన్వయంతో జాతరను విజయవంతంగా నిర్వహించడం పట్ల అధికారులు, ఉద్యోగులు ఊపిరి పీల్చుకున్నారు.

కైకాల వంశస్థులకు అవమానం

గంగమ్మ జాతర చివరిరోజు అర్థాంతరంగా రాజకీయ రగడగా మారింది. గంగమ్మ నినాదాలు మార్మోగాల్సిన సమయంలో టిడిపి, జనసేన నాయకుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. జనసేన నాయకులను ఆలయంలోకి అనుమతించలేదనే ఆరోపణలతో ఉద్రిక్తత ఏర్పడింది. ఇంతలో మరో ఘటన భక్తులను కలసి వేసింది. పేరంటాల వేషధరి, తమ వంశపారంపర్యంగా గంగమ్మ తల్లి ప్రతిరూపంగా వేషం వేసి చివరి రోజు విశ్వరూప చెంప తొలగింపుకు ఆలయానికి రాగానే గేట్లను మూసేయడంతో అవమానంతో వెనుదిరిగారు.. కైకాల వంశస్థులకు అవమానం జరిగిందని వాపోయారు. తమ కుటుంబం తరతరాలుగా గంగమ్మకు సేవ చేస్తున్నా, ఇలా అవమానించడం ఏంటని వాపోయారు. అధికారులు, కూటమి నాయకులు తమ ప్రాబల్యం కోసం గంగమ్మ తల్లి జాతరను చివరిరోజు రాజకీయ అడ్డాగా మార్చేశారన్న విమర్శలు లేకపోలేదు.



పునః వ్యవస్థీకరణపై.. సమీక్షించాలి..!

- జీవో 117ను రద్దు చేయాల్సిందే
- ఉపాధ్యాయ, విద్యార్థి సంఘాల డిమాండ్

ప్రజాశక్తి - తిరుపతి డెస్క్

ప్రభుత్వ పాఠశాలల పున్ణ వ్యవస్థీకరణ కోసం విడుదల చేసిన జీవో 117 పై ఉపాధ్యాయ, విద్యార్థి సంఘం నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జీవో అమలు కోసం విడుదల చేసిన మార్గదర్శకాలపై పున్ణ సమీక్షించాల్సిందేనని డిమాండ్ చేస్తున్నాయి. తమకున్న అనేక అనుమానాలను నివత్తి చేయకుండానే ప్రభుత్వం పాఠశాలల హేతుబద్ధికరణ దిశగా ముందుకెలితే తీవ్ర పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరిస్తున్నాయి. ఇప్పటికైనా తీరు మార్చుకోకుంటే ఉద్యమం తప్పదు అంటూ కార్యాచరణకు సిద్ధమవుతుండడం గమనార్హం.

వచ్చే విద్యా సంవత్సరం నుంచి ప్రభుత్వ పాఠశాలల స్వరూపం మారనుంది. ఫౌండేషన్, ఫౌండేషన్ ప్లస్, బేసిక్ ప్రైమరీ, మోడల్ ప్రైమరీ, అప్పర్ ప్రైమరీ, హైస్కూల్, హైస్కూల్ ప్లస్ పేర్లతో బడులను పునర్వ్యవస్థీకరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నద్ధమయింది. రాష్ట్రంలో 20 వేల బేసిక్ ప్రైమరీ పాఠశాలల (బిపిఎస్)ను ఏర్పాటు చేయాలని పాఠశాల విద్యాశాఖ నిర్ణయించింది. ప్రతి పంచాయతీకి ఒక మోడల్ ప్రైమరీ స్కూల్ (ఎంపిఎస్) విధానాన్ని విద్యాశాఖ తీసుకొస్తుంది.ప్రభుత్వ విద్యారంగాన్ని బలంగా తయారు చేస్తామని చెప్పిన ప్రభుత్వం, దానికి విరుద్ధంగా గత ప్రభుత్వ బాటలోనే ప్రయాణిస్తోంది.ఉపాధ్యాయుల సంఖ్య ను తగ్గించి పనిభారం పెంచుతోంది. హైస్కూల్సులో 54మంది విద్యార్థులు ఉంటేనే 2వ పోస్టు కేటాయిస్తామనే వైఖరి తీసుకోవడం వల్ల ఉన్నత పాఠశాలల్లో వేలాది పోస్టులు ముఖ్యంగా గణితం, ఇంగ్లీషు స్కూలు అసిస్టెంట్ పోస్టులు సర్ ప్లస్ అవుతున్నాయి. మోడల్ ప్రైమరీ స్కూల్సుకు ప్రాధాన్యమిస్తూ ఫౌండేషన్ స్కూల్సు, బేసిక్ ప్రైమరీ స్కూల్సును నిర్వీర్యం చేస్తుండడంతో ఇప్పటికే దశలవారీగా పోరాటం చేసిన ఉపాధ్యాయ సంఘాల నేతలు మే 15వ తేదీన వేలాదిమంది ఉపాధ్యాయులతో విద్యాభవన్‌ను ముట్టడించనుండడం గమనార్హం.

లోపాలను సరిదిద్దాలి: ఎస్ఎస్ నాయుడు, యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి



నూతన ప్రభుత్వం 117 జీవోను రద్దు చేస్తూ పాఠశాలలను పునర్వ్యవస్థీకరించిన విధానాన్ని సరిదిద్దాల్సిందే. ప్రాథమిక పాఠశాలను బేసిక్ పాఠశాలలుగా కొనసాగించాలని కోరగా ఫౌండేషన్ పాఠశాలలుగా, మోడల్ ప్రైమరీ పాఠశాలలుగా విభజించడమే కాకుండా కొన్నిచోట్ల ఒకటి నుండి ఐదు తరగతులను హైస్కూలులో కలపడం, మూడు, నాలుగు, ఐదు తరగతులు సమీప పాఠశాలల్లో విలీనం చేయడం సరైన విధానం కాదు .పునర్వ్యవస్థీకరించిన పాఠశాలల్లో ఉపాధ్యాయులను కేటాయించే సందర్భంలో కొన్ని పాఠశాలలకు పదిమంది విద్యార్థులకు ఉపాధ్యాయుడు కొన్నింటిలో 20 మంది విద్యార్థులకు ఒక ఉపాధ్యాయుడు కొన్నింటిలో 30 మందికి విద్యార్థులకు ఒక ఉపాధ్యాయుడిని కేటాయించడాన్ని సవరించాలని కోరుతున్నాం. ప్రాథమిక పాఠశాలలో ఏ రూపంలో ఉన్న ఒకే రకమైన ఉపాధ్యాయ -విద్యార్థి రేషియోను కలిగి ఉండాలని కోరుతున్నాం. అలాగే బదిలీల సందర్భంగా అనేక మోడల్ ప్రైమరీ పాఠశాలలకు స్కూల్ అసిస్టెంట్లను కేటాయించవద్దని కోరుతున్నాం.

పేద విద్యార్థులకు విద్యను దూరం చేయడమే: భగత్‌రవి, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి



మోడల్ స్కూల్స్ పేరుతో పేద విద్యార్థులకు విద్యను దూరం చేసేందుకే ప్రభుత్వం కుట్రలు చేస్తోంది.177 జిఓ ద్వారా జిల్లా లో దాదాపు మోడల్ పేరుతో 700 దాక పేదలు చదివే పాఠశాలలు మూసివేయడం దుర్మార్గం. స్కూల్ మేనేజ్మెంట్ కమిటీల పై జిల్లా కలెక్టర్ నుంచి స్థానిక విద్యా శాఖ అధికారలందరు ఒత్తిడి తీసుకొచ్చి పాఠశాలల్ని మూసివేస్తుండటం శోచనీయం. ప్రభుత్వ పాఠశాలల పరిరక్షకులుగా ఉండాల్సిన వారే ఒత్తిడితో వాటిని మూసి వేసేందుకు సహకరిస్తుండడం దుర్మార్గం.

డీఎస్సీ అభ్యర్థులకు 'దరఖాస్తు' కష్టాలు

నేటితో ముగియనున్న గడువు

ప్రజాశక్తి - క్యాంపస్

రాష్ట్రవ్యాప్తంగా లక్షల సంఖ్యలో నిరుద్యోగ సైన్యం, టిటిసి, బీఈడీ, తెలుగు పండిట్, ఎంఈడి చేసి మెగాడీఎస్సీ నోటిఫికేషన్ కోసం నిరీక్షించారు. అయితే దరఖాస్తులు చేసే విధానంలో తీవ్ర సమస్యలను ఎదుర్కొంటున్నారు. ఎన్నో సంవత్సరాలుగా కోచింగ్ తీసుకుంటున్న అభ్యర్థులు కూడా తమ సిలబస్‌ను రివిజన్ చేసుకోవడానికి కనీసం రెండు నెలల సమయమైనా పడుతుందని ఆందోళన చెందుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం డీఎస్సీ దరఖాస్తు చేసుకోవడానికి కనీసం నెలరోజులు సమయం ఇవ్వకపోవడం దారుణమని విద్యార్థి సంఘాల నేతలు తీవ్రంగా విమర్శిస్తున్నారు.


పది సంవత్సరాల నిరుద్యోగుల నిరీక్షణకు ఎట్టకేలకు 16 వేల పోస్టుల భర్తీకి రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇందులో భాగంగా మే 15వ తేదీ దరఖాస్తు చేయడానికి చివరి గడువు నిర్ణయించింది. అయితే మే 5వ తేదీ వరకు కూడా దరఖాస్తు చేసేందుకు చాలామంది అభ్యర్థులకు ఇంటర్నెట్ ఆన్లైన్ అప్లికేషన్ సరిగా ఓపెన్ కాకపోవడం అనేక సాంకేతిక కారణాల వైఫల్యాలపై రాష్ట్ర ప్రభుత్వానికి ఫిర్యాదులు అందాయి. ఇప్పటికి రాష్ట్రవ్యాప్తంగా మూడు లక్షల పైచిలుకు నిరుద్యోగులు డీఎస్సీ కొరకు దరఖాస్తు చేసుకున్నారని సమాచారం. అయితే డీఎస్సీ నోటిఫికేషన్‌లో ఈడబ్ల్యూఎస్ శాతం గురించి పొందుపరచకపోవడం బాధాకరమని కొందరు విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరికొందరు స్పోర్ట్స్ కోటా కింద ఇచ్చిన పోస్టులకి రిజర్వేషన్లు సరిగా లేవని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డీఎస్సీ దరఖాస్తులలో స్థానిక కోట, స్థానికేతర కోటాల అంశాలు కూడా తప్పులుగా ఉన్నాయని మరికొందరు అభ్యర్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి మొదటి సంతకం డీఎస్సీని సంతకం చేసి, డీఎస్సీ నిర్వహిస్తామని చెబుతూ వచ్చిన ప్రభుత్వం చివరికి సంవత్సరం పూర్తి అయిన తర్వాత నోటిఫికేషన్ ఇచ్చి తొందరగానే ఒక నెల సమయం కూడా ఇవ్వకుండా దరఖాస్తు గడువు ముగించడం, నెల 10 రోజుల్లోనే పరీక్షలు నిర్వహించడం దారుణమని మరికొందరు అభ్యర్థులు తమ ఆవేదనను వెలిబుచ్చారు. ఎంతోమంది అభ్యర్థులు లక్షల రూపాయలు కోచింగ్‌కు ఖర్చుపెట్టి సంవత్సరం పొడుగునా నిరీక్షిస్తే ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం ఆగమేఘాల మీద ఒక నెలలో పరీక్షలు నిర్వహించడం దారుణం అన్నారు. కనీసం సంవత్సరం రోజులు చదివిన, కోచింగ్ తీసుకున్న పుస్తకాలు, మెటీరియల్స్ ఒకసారి చదవడానికి, రివిజన్ చేసుకోవడానికి సమయం చాలదని తీవ్ర మనోవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే చాలామంది డీఎస్సీ అభ్యర్థులు రాష్ట్ర ప్రభుత్వానికి, ఉన్నత విద్యా శాఖ కార్యదర్శికి గవర్నర్ కు ఈమెయిలు ద్వారా, లేఖలను పంపించారు. అయితే డీఎస్సీ హెల్ప్ లైన్ సెంటర్స్ నుంచి కూడా ఎటువంటి విలువైన సమాచారం అందలేదని లక్షలమంది విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డీఎస్సీ పై ఎన్నో ఆశలు పెట్టుకొని నిరంతరం గత మూడు, నాలుగు సంవత్సరాలకు పైగా చదువుతున్న విద్యార్థులకు తీవ్ర నిరాశలో కోరుకుపోయారు. దరఖాస్తు చెల్లింపు విధానం, సర్టిఫికెట్ల అప్లోడింగ్ విధానం చెత్తగా ఉందని డిఎస్సీ అభ్యర్థుల తీవ్రంగా విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, విద్యాశాఖ కార్యదర్శి డిఎస్సీ నిర్వహణలో తప్పులను గుర్తించి, డీఎస్సీకి చదువుకుంటున్న విద్యార్థులకు కనీసం మూడు నెలల కాలపరిమితితో పరీక్షలు నిర్వహించాలని డిమాండ్ చేస్తున్నారు. లేనిపక్షంలో నిరుద్యోగ యువత యొక్క సామర్థ్యం, ఆలోచన, శక్తి సామర్థ్యాలను భవిష్యత్తులో వచ్చే ఎన్నికల్లో నిరూపిస్తామని హెచ్చరించారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం డీఎస్సీ అభ్యర్థుల విన్నపాలను, సమస్యలను పరిశీలించి దరఖాస్తు చేసుకొనే తేదీలను పొడిగించాలని, అలాగే పరీక్షా నిర్వహణకు సంబంధించి తేదీలను రెండు నెలలు లేదా మూడు నెలల గడువు పెంచాలని కోరుతున్నారు.



స్విమ్స్‌లో మరింత ఉన్నతంగా వైద్యసేవలు : టిటిడి చైర్మన్

ప్రజాశక్తి - తిరుపతి సిటి

తిరుపతి స్విమ్స్‌లో మరింత ఉన్నతంగా వైద్యసేవలు అందిస్తామని టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడు తెలిపారు. బిఆర్ నాయుడు అధ్యక్షతన స్విమ్స్‌లో బుధవారం జనరల్ కౌన్సిల్ సమావేశం జరిగింది. ఛైర్మన్ మాట్లాడుతూ స్విమ్స్‌లో మరింత ఉన్నతంగా సేవలను అందించేందుకు టిటిడి ఈవో ఐవి సుబ్బారావు అధ్యక్షతన వేసిన ప్రత్యేక ఎక్స్‌పర్ట్ కమిటీ అధ్యయనం చేసి నివేదిక సమర్పించిందన్నారు. మౌలిక సదుపాయాలు, మానవ వనరులు, వైద్య పరికరాలు, ఇంజినీరింగ్ పనులు మరింత ఉన్నతంగా అందించేందుకు నిధుల సేకరణ తదితర అంశాలపై నివేదిక సమర్పించారన్నారు. ఈ నివేదికపై టిటిడి బోర్డులో చర్చించి రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం మేరకు తదుపరి నిర్ణయం తీసుకుంటామన్నారు. ఈవో జె.శ్యామలరావు మాటాలడుతూ స్విమ్స్ చాలా ప్రతిష్టాత్మకమైనదని, 2021లో టిటిడికి స్విమ్స్‌ను అప్పగించారని, ఏడాదికి ఎంప్లాయి హెల్త్ స్కీం, ప్రాణదాన ట్రస్టు, వివిధ రకాల ట్రస్టుల ద్వారా దాదాపు వంద కోట్లకు పైగా సపోర్టు చేస్తున్నామన్నారు. ఏడాదికి 18వేల సర్జరీలు, దాదాపు 4.50 లక్షలకు పైగా ఔట్‌పేషంట్లు, 47వేల ఇన్‌పేషంట్లకు వైద్యసేవలను అందిస్తున్నామన్నారు. భవిష్యత్ తరాలకు సరిపడేలా నూతన భవనాల నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. అంకాలజీ, చిన్నపిల్లల హెల్త్ కోసం నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. అంతకుముందు టిటిడికి అనుబంధంగా ఉన్న స్విమ్స్‌లోని అత్యాధునిక వైద్య పరికరాలతో నిర్మితమవుతున్న క్యాన్సర్ భవనాన్ని టిటిడి ఛైర్మన్ పరిశీలించారు. రోగులకు అందుతున్న వైద్యసేవలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎక్స్ ఫర్ట్ కమిటీ ఛైర్మన్ డా.ఐ.వి.సుబ్బారావు, సభ్యులు డా. జెఎస్ఎన్ మూర్తి, తేజోమూర్తుల రామోజీ, డా. చెన్నంశెట్టి విజయ్ కుమార్, స్విమ్స్ డైరెక్టర్ డా. ఆర్వీ కుమార్ హాజరయ్యారు.



అన్నమయ్య సంకీర్తనలతో పరబ్రహ్మ దర్శనం : ఆచార్య చెన్నప్ప

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

అన్నమయ్య అక్షర సరస్వతిని ఆశ్రయించి తన సంకీర్తనలతో సామాన్యులకు పరబ్రహ్మ స్వరూపాన్ని చూసిన అనుభూతి కల్పించారని హైదరాబాద్ ఉస్మానియా విశ్వవిద్యాలయం విశ్రాంత ఆచార్యులు ఆచార్య చెన్నప్ప పేర్కొన్నారు. శ్రీ తాళ్లపాక అన్నమాచార్యుల 617వ జయంతి ఉత్సవాల్లో భాగంగా తిరుపతి అన్నమాచార్య కళా మందిరంలో నిర్వహిస్తున్న సాహితీ సదస్సులు బుధవారం నాలుగవ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా నిర్వహించిన సాహితీ సదస్సుకు అధ్యక్షత వహించిన ఆచార్య చెన్నప్ప " అన్నమయ్య సంకీర్తనలు - బ్రహ్మసాక్షాత్కారం " అనే అంశంపై ఉపన్యసిస్తూ, ఆనాటి రాజకీయ కాలమాన పరిస్థితుల కారణంగా ప్రజల్లో అడుగంటిన భక్తిభావాన్ని చైతన్య పరిచి ఆధ్యాత్మిక సమైక్యత సాధించేందుకు శ్రీవేంకటేశ్వరస్వామివారిని కేంద్రంగా చేసుకుని అన్నమయ్య సంకీర్తనలు రచించి వ్యాప్తి చేశారని చెప్పారు. భగవంతుని చేరడానికి భక్తి సులభమైనదన్నారు. భగవంతుని ప్రేమతో, భయంతో, స్నేహంతో, కోపంతో, ఎన్ని విధాలుగా ఆరాధించినా చేరుకోవచ్చని వివరించారు. తిరుపతికి చెందిన విశ్రాంత ఆకాశవాణి సంచాలకులు మల్లేశ్వరరావు " అన్నమయ్య సంకీర్తనల్లో సామాజిక సందేశం " అనే అంశంపై మాట్లాడుతూ అప్పటి సమాజంలోని అనేక రుగ్మతలను బాహాటంగా విమర్శించి ప్రజల మన్ననలు చూరగొన్న ప్రజాకవి, అభ్యుదయ కవి, సంఘసంస్కర్త అన్నమయ్య అన్నారు. నగరి ప్రభుత్వ డిగ్రీ, పిజి కళాశాల అధ్యాపకులు వరలక్ష్మీ పాల్గొన్నారు. సాయంత్రం సంగీత కార్యక్రమాలు అభిమానులను అలరించాయి. ఈ కార్యక్రమంలో అన్నమాచార్య ప్రాజెక్టు సంచాలకులు మేడసాని మోహన్, ప్రోగ్రాం అసిస్టెంట్ లత పాల్గొన్నారు.

డీఎస్సీ విద్యార్థులకు ఉచిత మెటీరియల్ పంపిణీ

ప్రజాశక్తి తిరుపతి సిటీ

తిరుపతి శ్రీ ప్రజ్ఞ స్టడీ సెంటర్లో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఉచిత మెగా డీఎస్సీ కోచింగ్ కేంద్రాన్ని జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి చెన్నారెడ్డి బుధవారం సందర్శించారు. స్థానిక పద్మావతి కళ్యాణ మండపం సమీపంలోని ఆ కోచింగ్ సెంటర్ వద్ద జరిగిన కార్యక్రమంలో మైనార్టీ విద్యార్థులకు ఉచితంగా డీఎస్సీ మెటీరియల్స్, ఫ్రీ ఎగ్జామ్ కిట్ పంపిణీ చేశారు. మైనారిటీ విభాగంలో టెట్ స్టేట్ టాపర్ చాంద్‌బాషను సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శ్రీ ప్రజ్ఞ స్టడీ సర్కిల్ ఫ్రీ కోచింగ్ సెంటర్ గా ఎంపిక కావడం అభినందనీయం అన్నారు. విద్యార్థులు ఎలా చదవాలి పరీక్షలో ఎదురయ్యే సమస్యలను ఎలా అధిగమించాలో వివరించారు. మోడల్ పరీక్షలంతా ఉపయోగకరమని, దీన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సైకాలజిస్ట్ కే హరిబాబు, ఆ సంస్థ డైరెక్టర్ మల్లీశ్వరి, డీఎస్సీ విద్యార్థులు పాల్గొన్నారు.



ఉచిత మెటీరియల్ పంపిణీ

శ్రీసిటీలో రక్తదాన శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి - సత్యవేడు

భారత సైనిక దళాలకు సంఘీభావంగా బుధవారం శ్రీసిటీలో నిర్వహించిన రక్తదాన శిబిరానికి విశేష స్పందన వచ్చింది. శ్రీసిటీ ఫౌండేషన్, తిరుపతి ఎన్ టి ఆర్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక బిజినెస్ సెంటర్ వద్ద ఉదయం 9.30 గంటలకు ప్రారంభమైన శిబిరంను శ్రీసిటీ డైరెక్టర్ (సిఎస్ఆర్) నిరీషా సన్నారెడ్డి లాంఛనంగా ప్రారంభించారు. సాయంత్రం 3.30 వరకూ సాగిన శిబిరంలో టి హెచ్ కె, యెక్సలెంట్ ఫార్మా, రాక్ వర్త్, ఈ-ప్యాక్, బ్రేక్స్ ఇండియా, బాంబే కోటింగ్, డైకి అల్యూమినియం, అల్సటాం, డైకిన్, కొబెల్కో, డానీలి, నోవా ఎయిర్, కింబర్లీ క్లార్క్, స్టేషన్ ఎస్ తో పాటు మరికొన్ని పరిశ్రమల ఉద్యోగులు,శ్రీసిటీ సెక్యూరిటీ సిబ్బంది సహా 320 మంది రక్తదానం చేశారు. శ్రీసిటీ వైస్ ప్రెసిడెంట్ (కస్టమర్ రిలేషన్స్) రమేష్ కుమార్, సెక్యూరిటీ హెడ్ వై.రమేష్, శ్రీసిటీ ఫౌండేషన్ సీనియర్ మేనేజర్ సురేంద్ర కుమార్, ఎన్ టి ఆర్ ట్రస్ట్ పీఆర్వో రవి పర్యవేక్షించారు.



శ్రీసిటీలో రక్తదాన శిబిరం


విధేయతే... వరించింది..!

'ప్రజాశక్తి'తో డాలర్ దివాకర్‌రెడ్డి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

'విధేయతే తనకు తుడా పదవి వచ్చేలా చేసింది' అని తుడా ఛైర్మన్ డాలర్ దివాకర్‌రెడ్డి చెప్పారు. తుడా పరిధిలో గ్రామాలను అభివృద్ధి చేస్తానని 'ప్రజాశక్తి'కి తెలిపారు. గతంలో తుడా పరిధిలో ఉండే అన్ని గ్రామాలను విస్మరించారని, ఆయా గ్రామాలను సందర్శించి వారి సమస్యలను గుర్తించి సహాయ సహకారాలు అందిస్తానన్నారు. పేదల అభ్యున్నతే తన లక్ష్యమన్నారు. తుడా ఛైర్మన్ పదవి రావడం పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్‌కు, ఐటి శాఖ మంత్రి నారా లోకేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. త్వరలోనే ప్రమాణ స్వీకారం చేయనున్నారు.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత దశలవారీగా పార్టీలో కష్టపడిన వారికి నామినేటెడ్ పదవులను అధినేతలు ఇస్తున్నారు. ముఖ్యంగా తిరుపతి నగరంలో నామినేటెడ్ పదవిని దక్కించుకోవడం ఆషామాషీ కాదు. 'మంచి పేరు' ఉంటేనే సరిపోదు 'అదృష్టం' కూడా ఉండాలన్నది డాటర్ దివాకర్‌రెడ్డిని చూస్తే అర్థమవుతుంది. కూటమి హయాంలో ఆయన చూపించిన విధేయత వల్లేనే అతనికి ఆ పదవి వరించిందని అనుయాయులు అంటున్నారు. డాలర్ దివాకర్‌రెడ్డి ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి. అంచెలంచెలుగా సేవా కార్యక్రమాల్లోనూ తన వంతు సహాయ సహకారాలను అందించేవారు. చంద్రగిరి, తిరుపతి, శ్రీకాళహస్తి నియోజకవర్గాల్లో సేవా కార్యక్రమాలను చేశారు. 2019 ఎన్నికల్లో చంద్రగిరి నియోజకవర్గం నుంచి ఎంఎల్‌ఎ అభ్యర్థిగా పోటీ చేయాలనుకున్నారు. అయితే అదృష్టం వరించలేదు. నియోజకవర్గంలో నిరుపేదలకు బట్టలను పంపిణీ చేయడం, ఉచిత వైద్యశిబిరాలు నిర్వహించడం, కాలనీలో తాగునీటి వసతి, మౌలిక సదుపాయాల కల్పనకు ఎంతో కృషి చేస్తూ నియోజకవర్గ ప్రజల మన్ననలు పొందారు. పేదలకు స్కాలర్‌షిప్పు అందించడమే గాకుండా, టెన్త్, ఇంటర్‌లో అత్యధిక మార్కులు సాధించిన వారికి ఆర్థిక సాయం అందిస్తున్నారు. పోలీసు కుటుంబాల్లోని వారికి స్కాలర్‌షిప్పులు ఇచ్చేవారు. 2021 తిరుపతి వరదల సందర్భంగా ఇటు తిరుపతి, అటు చంద్రగిరి నియోజకవర్గాల్లో పేదలకు నిత్యావసర వస్తువులు పంపిణీ చేసి ఆదుకున్నారు. దీపావళి సందర్భంగా నిరుపేదలకు బట్టలను పంపిణీ చేసి దాతృత్వాన్ని చాటుకున్నారు. యువ క్రీడాకారులకు దుస్తులతో పాటు, ఆట వస్తువులను ఉచితంగా అందించేవారు. క్రీడల్లో రాణించిన వారికి పెద్దఎత్తున నగదు బహుమతులను అందజేశారు. వేసవిలో ఉచిత మజ్జిగ కేంద్రాలు, చలివేంద్రాలను ఏర్పాటు చేశారు. అంతేకాకుండా తనను ఎంఎల్‌ఎ అభ్యర్థిగా అవకాశం ఇవ్వకపోయినా 2024లో కూటమి అభ్యర్థులను ఎంఎల్‌ఎలుగా గెలిపించుకోవడంలో చంద్రగిరి, శ్రీకాళహస్తి, నగరి అభ్యర్థులకు తనవంతు ఆర్థిక సాయం అందజేయడమే గాకుండా, సామాజికవర్గం ఓట్లు పడేలా చేశారు. తిరుపతి జనసేన ఎంఎల్‌ఎ గెలుపుకు తన వంతు సాయం అందించారు. ఎన్నికలకు ముందు తన సిబ్బందితో సర్వేలు చేయించి అధిష్టానానికి అందజేశారు. ఏ పదవి ఆశించకుండా డాలర్ దివాకర్‌రెడ్డి కూటమికి చూపిన విధేయత వల్లే తుడా ఛైర్మన్ పదవి ఆయనను వరించిందని అనుచరులు సంబరాలు చేసుకుంటున్నారు. ఈ మేరకు బుధవారం డాలర్ దివాకర్‌రెడ్డి పేరు సూచిస్తూ ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు అందాయి. రెండేళ్ల పాటు ఈ పదవిలో ఉండనున్నారు. తుడా పరిధిలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. ఈ నియోజకవర్గాలన్నింటిలోనూ అభివృద్ధి చేసే అవకాశం తుడాకు ఉంది. తుడా ఛైర్మన్ పదవికి ఎంతోమంది పోటీపడినా అధిష్టానం డాలర్ వైపే మొగ్గుచూపింది. మాజీ ఎంఎల్‌ఎ సుగుణమ్మ, టిడిపి పార్లమెంట్ అధ్యక్షులు నరసింహయాదవ్, జనసేన అధ్యక్షులు డాక్టర్ హరిప్రసాద్, బిజెపి జిల్లా అధ్యక్షులు సామంచి శ్రీనివాసు ప్రయత్నాలు చేశారు. తిరుపతి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఛైర్మన్‌గా పనిచేసిన వారిలో చాలా మంది ఎంఎల్‌ఎగా పోటీచేసి గెలుపొందిన చరిత్ర తిరుపతికి ఉంది. డాలర్ దివాకర్‌రెడ్డికి 2029లో ఎంఎల్‌ఎ టికెట్ దక్కే అవకాశం ఉందన్న ఊహాగానాల్లో ఆయన అనుచరగణం ఉంది.



చంద్రబాబుతో 'డాలర్'

అన్ని దానాల్లోకెల్లా అన్నదానం మిన్న

- మయూరి శ్యామ్ యాదవ్


అన్నదానం చేస్తున్న దాత

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : అన్ని దానాల్లోకెల్లా అన్నదానం మిన్న అని శ్రీ కృష్ణ సేవా సమితి అధ్యక్షుడు మయూరి శ్యామ్ యాదవ్ పేర్కొన్నారు. గుడూరులోని గమళ్లపాలెం లోని ఓం సాయిరాం వృద్ధాశ్రమంలో మయూరి శ్యామ్ యాదవ్ దాతృత్వంతో బుధవారం అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా మయూరి శ్యామ్ యాదవ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలన్నారు.

సోమేశ్వరుని ఆలయంలో..

గూడూరు టౌన్ : గూడూరు త్యాగరాజ వీధిలో మీనాక్షి దేవి సమేత సోమేశ్వరాలయంలో బుధవారం స్వామికి విశేష అలంకరణ, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్నదానం ఏర్పాటు చేశారు. భక్తులకు అన్నప్రసాదాలు అందించారు. ప్రతి బుధవారం అన్నదానం నిర్వహిస్తామని ఆలయ పూజారి తెలిపారు .

ఇంటర్ పరీక్షలకు 835 మంది గైర్హాజరు

ప్రజాశక్తి తిరుపతి సిటీ: జిల్లా వ్యాప్తంగా బుధవారం నిర్వహించిన ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు 835 మంది విద్యార్థులు గైరహాజరైనట్లు ఆర్ఐఓ ప్రభాకర్ రెడ్డి ప్రకటనలు తెలిపారు. ఉదయం నిర్వహించిన మొదటి సంవత్సరం పరీక్షలకు 16,979 మంది దరఖాస్తు చేసుకోగా 723 గైర్హాజరయ్యారని, 16,256 మంది పరీక్షలకు హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 2093 దరఖాస్తు చేసుకోగా 112 మంది విద్యార్థులు గైర్హాజరు. కాగా 1,981 మంది విద్యార్థులు పరీక్షలు హాజరయ్యారని వెల్లడించారు.

జాబ్ మేళా కరపత్రాలు విడుదల


జాబ్‌మేళా కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : ఆంధ్రప్రదేశ్‌రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీ ఎస్ఎస్‌డిసి)ఆధ్వర్యంలో ఈనెల 16 వ తేదీ పుత్తూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించనున్న జాబ్ మేళాకు సంబంధించిన కరపత్రాలను నగరి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ బుధవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, అధికారులు పాల్గొన్నారు.



ఐటి కంపెనీల్లో వివిధ ఉద్యోగాలు పొందిన వారిని సన్మానిస్తున్న దృశ్యం

ఘనంగా యంబియు - 2025 అచీవర్స్ డే

1600 మంది విద్యార్థులకు ఉద్యోగాల కల్పన

ప్రజాశక్తి -రామచంద్రాపురం(చంద్రగిరి): చంద్రగిరి మండలం ఎ రంగంపేట సమీపంలోని శ్రీ సాయినాథ్ నగర్‌లోని మోహన్ బాబు విశ్వవిద్యాలయంలో బుధవారం 2025 విద్యా సంవత్సరం అచీవ ర్స్ డే ఘనంగా నిర్వహించారు. యంబియు ఇండోర్ స్టేడియం లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్లేస్ మెంట్స్ పొందిన 1600 మందికి పైగా విద్యార్థులను ఆ విశ్వవిద్యాలయ ప్రొ ఛాన్సలర్ మంచు విష్ణు ముఖ్య అతిథిగా హాజరై ప్లేస్ మెంట్ పొందిన విధ్యార్థులను ఘనంగా సత్కరించారు. తల్లిదండ్రులతో కలిసి విద్యార్థులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా మంచు విష్ణు మాట్లాడుతూ విజయం అంతం కాదు, ప్రయాణమన్నారు. మాత, పిత, గురువు దైవాలను జీవితాం తం గుర్తుంచుకోవాలని వాళ్లను బాధ పెట్టిన వాళ్లను సమాజం క్షమించ దన్నారు. ఈ విద్యాసంస్థలో విద్యను అభ్యసించిన విద్యార్థులందరూ మంచి స్థాయిలోఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వినయ్ మహేశ్వరి, ఆచార్య నాగరాజ రామ్ రావ్, ప్రొ కరుణాకరన్, వికాస్ సింగ్ ఛీఫ్ గ్రోత్ అండ్ స్ట్రాటజిక్ ఆఫీసర్, రిజిస్ట్రార్ డాక్టరు కె సారథి, డీన్లు, అధ్యాపకులు విద్యార్థులు సిబ్బంది పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి 'మెప్మా' కృషి : కలెక్టర్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్ : స్వయం సహాయక మహిళల ఆర్థికాభివృద్ధికి మెప్మా ద్వారా కృషి చేయాలని కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ అన్నారు. బుధవారం వీడియా కాన్ఫరెన్స్ ద్వారా బ్యాంకు లింకేజి, తదితర అంశాలపై మున్సిపల్ కమిషనర్ మౌర్య, పీడీ రవీంద్ర, ఎల్‌డిఎం విశ్వనాథరెడ్డితో కలిసి సమీక్షించారు. రాపిడ్ వెహికల్స్, తృప్తి క్యాంటీన్, టూరిజం సర్వీసెస్, అమతమిత్ర వంటి స్పెషల్ ప్రాజెక్టులను ప్రారంభించడం ద్వారా ఎక్కువ మంది మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదిగే అవకాశం ఉంటుందని తెలిపారు. జిల్లా సమాఖ్య ఆధ్వర్యంలో మహిళలచే పెట్రోల్ బంకు నిర్వహణకు సంబంధించిన స్థల సేకరణ చేపట్టి పెట్రోల్ బంకు ఏర్పాటు కు సంబంధించిన పనులు ప్రారంభించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల శాఖ అధికారి సుధాకర్ రావు పాల్గొన్నారు.


నేడు ఎంబియు ఒప్పందం

ప్రజాశక్తి -రామచంద్రాపురం (చంద్రగిరి): మోహన్ బాబు విశ్వవిద్యాలయంలోని దాసరి ఆడిటోరియంలో గురువారం మోహన్ బాబు విశ్వవిద్యాలయం, అమెరికాలోని పెన్ స్టేట్ విశ్వవిద్యాలయం మధ్య పరస్పర అంగీకార ఒప్పందం కుదుర్చుకోనున్నారు. పెన్ స్టేట్ విశ్వవిద్యాలయం 100 క్యూఆర్ ర్యాంకు లోపల ఉండటం గొప్ప విషయం. పెన్ స్టేట్ నుంచి విశ్వవిద్యాలయం ఛాన్సలర్ డాక్టర్ డేవిడ్ కాల్లజో ఫెరోజ్, వైస్ ఛాన్సలర్ డాక్టర్ వావిద్ మోటావోలి, మోహన్ బాబు విశ్వవిద్యాలయం నుంచి ఛాన్సలర్ డాక్టర్ మోహన్ బాబు, ప్రో ఛాన్సలర్ మంచు విష్ణు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వినయ్ మహేశ్వరి, ప్రోవోస్ట్ ఆచార్య నాగరాజ రామారావు, వైస్ ఛాన్సలర్ డాక్టర్ కరుణాకరన్, రిజిస్ట్రార్ డాక్టర్ సారథి పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ మహా కుంభాభిషేకం

.ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : రూరల్ మండలం తిరుమల కుప్పం గ్రామం లో రేణుక పరమేశ్వరి మాతమ్మ ఆలయం విగ్రహ ప్రతిష్ట మహా కుంభాభిషేకం ఉత్సవంలో పూర్ణకుంభంతో వేద పండితులు వేదమంత్రాలతో రేణుకా పరమేశ్వరి మాతమ్మ విగ్రహ ప్రతిష్టాపన చేశారు. గణపతి పూజా రుద్ర పారాయణం, , హోమం, లలిత సహస్ర నామార్చన జలాధివాసం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన మాజీ మంత్రి ఆర్కే రోజాకు మర్యాద పూర్వకంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పుత్తూరు మండల రూరల్ అధ్యక్షులు అన్నా లోకనాథం , జిల్లా పార్టీ సభ్యులు, ప్రజా నిధులు, వైసిపి నాయకులు, నియోజకవర్గ అనుబంధ విభాగ ప్రసిడెంట్లు, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అందర్నీ చల్లంగా చూడమ్మా : బియ్యపు



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: 'పట్టణ ప్రజలందర్నీ చల్లంగా చూడు..' అంటూ మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి బీపీ అగ్రహారం గంగమ్మను వేడుకున్నారు. బిపి అగ్ర హారం గంగమ్మ జాతరలో బుధవారం మాజీ ఎమ్మెల్యే పాల్గొన్నారు. మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. శ్రీకాళహస్తి పట్టణవాసుల కష్టాలు తీర్చాలని వేడుకున్నారు. మాజీ ట్రస్ట్ బోర్డు చైర్మన్ అంజూరి శ్రీనివాసులు, రత్నం రెడ్డి, ఆర్కాడ్ శంకర్ పాల్గొన్నారు.

పలు చోట్ల ఎర్రచందనం దుంగలు పట్టివేత

వాహనాలు స్వాధీనం


యర్రావారిపాలెంలో

ప్రజాశక్తి-యర్రావారిపాలెం: రహస్య సమాచారం మేరకు అటవీ శాఖాధికారులు అప్రమత్తమై తరలిపోతున్న ఎర్రచందనం దుంగలు, కారును స్వధీనం చేసుకున్నామని తెలిపారు. భాకరాపేట అటవీ క్షేత్ర అధికారి ఎన్ వెంకటరమణ కథనం మేరకు.. రహస్య సమాచారం మేరకు భాకరాపేట అటవీ క్షేత్ర అధికారి ఎన్ వెంకటరమణ తన సిబ్బందితో కలిసి మంగళవారం రాత్రి అప్రమత్తమయ్యారు. మండలంలోని ఎల్లమంద రోడ్డు మార్గంలో కారులో తమిళనాడుకు అక్రమంగా ఎర్రచందనం తుంగలు రవాణా చేస్తుండగా ఎల్లమంద రోడ్డు మార్గంలో మంగళవారం రాత్రి 11 గంటల ప్రాంతంలో అటవీ అధికారులు ఆ వాహనాన్ని వెంబడించారని తెలిపారు. వేగంగా వెళ్లిన కారు ఇరగంరెడ్డి గారిపల్లి రోడ్డు మధ్యలోని తూనికాకుల బండ మధ్యలో కారు ఆపి ఇద్దరు స్మగ్లర్లు పరారయ్యారని తెలిపారు. కారును పరిశీలించగా 8 ఎర్రచందనం దుంగలు కనిపించాయని వాటి బరువు 200 కేజీలు వుంటుందని, వాటి విలువ సుమారు 10 లక్షలు ఉంటుందని అధికారులు అంచనా వేశారు. ఈ దాడిలో ఎఫ్ఎస్ఓ మునుస్వామి నాయక్, ఎఫ్ బిఓలు రాజేష్ కుమార్, లక్ష్మీ ప్రసాద్, డ్రైవర్, ప్రొటెక్షన్ వాచర్లు పాల్గొన్నారు.


పుత్తూరులో

పుత్తూరు టౌన్ : అధికారులకు అందిన ముందస్తు సమాచారంతో అప్రమత్తంతో ఎర్రచందనం దుంగలతో పాటూ ఓ ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు అటవీ అధికారులు పేర్కొన్నారు. అటవీ శాఖ అధికారులు రహస్య సమాచారం మేరకు. పుత్తూరు అటవీ క్షేత్ర అధికారిణి డి మాధవి, కేవీబీ పురం మండలం రాయలచెరువు సమీపంలో ఎర్రచందనం దుంగలను తమిళనాడుకు అక్రమ రవాణా చేస్తుండగా వెంటనే పిచ్చాటూరు, సదాశివకోన బేస్ క్యాంపు సిబ్బందిని అప్రమత్తం చేశారు. బుధవారం సాయంత్రం 6 గంటలకు ముగ్గురు వ్యక్తులు ఎర్రచందనం దుంగలను రవాణా చేసేందుకు యత్నించారు. వారిని వెంబడించి ముగ్గురితో పాటూ ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిందితులు మణి, శీనయ్య, రాజాను అరెస్టు చేశారు. చుట్టు పక్కల పరిశీలించగా 30 ఎర్రచందనం దుంగలు, వేర్లు వాటి బరువు 374. 50 లక్షల రూపాయలు వుంటుందని తెలిపారు. ఈ దాడుల్లో. ఆర్‌వి రవి ప్రకాష్, కే లోకనాథం, ఎం సురేష్ కుమార్, నీలకంఠ వాసు, సదాశివకోన బేస్ క్యాంప్ వాచర్లు పాల్గొన్నారు.



తిరుపతి(మంగళం): శేషాచలం అటవీ పరిధి కడప ఫారెస్ట్ డివిజన్ లోని సిద్ద వటం రేంజ్ పరిధిలో తొమ్మిది ఎర్రచందనం దుంగ ల సహా ఒక మోటారు సైకిల్‌ను స్వాధీనం చేసు కున్నట్లు టాస్క్ ఫోర్స్ పోలీసులు తెలిపారు. టాస్క్ ఫోర్స్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆర్ఐ చిరంజీవులుకు చెందిన ఆర్ఎస్ఐ ఎం.మురళీధరరెడ్డి బృందం సోమవారం సాయంత్రం సిద్దవటం ఫారెస్ట్ బీటు చేరుకొని అక్కడ నుంచి స్థానిక అటవీ అధికారులు పెంచల్ రెడ్డి, షేక్ జాఫర్, కె రాజేష్ లతో కలసి నిత్యపూజకోన వైపు కూంబింగ్ చేసుకుంటూ వెళ్లారన్నారు. మంగళవారం ఉదయం గొల్లపల్లి ఫారెస్ట్ సెక్షన్, ఎస్ రాజాంపేట సమీపంలో ఒక మోటారు సైకిల్ కనిపించిందని, పోలీసులు అక్కడకు చేరుకునే సరికి అక్కడ ఉన్న ఇద్దరు వ్యక్తులు పారిపోవడానికి ప్రయత్నించారన్నారు. వారిని పట్టుకుని చుట్టుపక్కల పరిశీలించగా తొమ్మిది ఎర్ర చందనం దుంగలను గుర్తించా మ న్నారు. వీరిద్దరూ కడప జిల్లాకు చెందిన వారని అరెస్టు చేసి ఎర్రచందనం దుంగలతో సహా తిరుపతి టాస్క్ ఫోర్స్ పోలీసు స్టేషన్‌కు తరలించా మన్నారు. డీఎస్పీ శ్రీనివాసు లు రెడ్డి వారిని విచారించగా, ఎస్ ఐ రఫీ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారని టాస్క్ ఫోర్స్ పోలీసులు తెలిపారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా వెంకటరామిరెడ్డి


ప్రిన్సిపాల్‌ను సన్మానిస్తున్న అధ్యాపకులు

ప్రజాశక్తి -సత్యవేడు: సత్యవేడు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా వెంకట రామిరెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరిం చారు. ఇక్కడ పనిచేస్తున్న ప్రిన్సిపాల్ మార్చిలో మృతి చెందారు. ఈ నేపథ్యంలో కడప బాలుర జూనియర్ కళాశాలలో సంస్కృత అధ్యాప కుడిగా పని చేస్తున్న వెంకటరామిరెడ్డి ఉద్యోగోన్నతిపై సత్యవేడు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా నియమితులు కావడంతో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఈ కళాశాలకు చెందిన అధ్యాపకులు ప్రిన్సిపాల్‌ను పూలమాలతో ఘనంగా సన్మానించారు.

దాసుకుప్పం పీహెచ్‌సీ వైద్యాధికారిగా డాక్టర్ హర్షవర్ధన్


బాధ్యతలు స్వీకరిస్తున్న వైద్యాధికారి డాక్టరు హర్షవర్ధన్

ప్రజాశక్తి - సత్యవేడు: సత్యవేడు మండలం దాసుకుప్పం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారిగా డాక్టర్ హర్షవర్ధన్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ వైద్యుల పోస్టు ఖాళీ అయిన నేపథ్యంలో ప్రభుత్వం వైద్యుల నియామకం చేపట్టింది. ఇందులో భాగంగానే దాసుకుప్పం పిహెచ్‌సి వైద్యాధికారిగా డాక్టర్ హర్షవర్ధన్ నియమితులై బాధ్యతలు స్వీకరించారు. దీంతోపాటు ఇన్‌చార్జి వైద్యులుగా పనిచేస్తున్న అరుణ్ కిషోర్ కొనసాగనున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ హర్షవర్ధన్ మాట్లాడుతూ రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడంతోపాటు ఆరోగ్య లక్ష్యాలను సాధించడానికి కృషి చేస్తామన్నారు.

గంగ జాతర విజయవంతం

ఉత్సవ కమిటీ సభ్యులు ఆముదాల తులసిరాం



మాట్లాడుతున్న ఆముదాల తులసిరాం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి తాతయ్య గుంట చిన్న గంగమ్మ జాతర ప్రజల ఘన సహకారంతో జయప్రదంగా ముగిసిందని ఉత్సవ కమిటీ సభ్యులు ఆముదాల తులసిరాం తెలిపారు. బుధవారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తాతయ్యగుంట చిన్న గంగమ్మ జాతరను తిరుపతి ప్రజలు, నగరపాలక సంస్థ అధికారులు, గంగమ్మ గుడి సిబ్బంది, జాతర నిర్వహణకు ప్రత్యేకంగా కూటమి ప్రభుత్వం, కలెక్టర్ ద్వారా ఏర్పాటు చేసిన ఉత్సవ కమిటీ సభ్యులు, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మబ్బు దేవనారాయణ రెడ్డిల సహకారంతో గంగమ్మ జాతర విశిష్టతను చాటామన్నారు. చిన్నపాటి ఇబ్బందులు తలెత్తిన విజయవంతంగా జాతర ముగింపు ఘట్టాన్ని పూర్తి చేశామన్నారు. ఈ సమావేశంలో ఉత్సవ కమిటీ సభ్యులు మన్యం శ్రీనివాసులు, ఆనంద్ యాదవ్, నందగోపాల్, జలపోతు చంద్ర, బాలసుబ్రమణ్యం, అశోక్, భూపతి పాల్గొన్నారు.

17 నుంచి కల్యాణ వేంకటేశ్వరస్వామి వార్షిక వసంతోత్సవాలు

ప్రజాశక్తి- రామచంద్రపురం (చంద్రగిరి): మండలంలోని శ్రీనివాస మంగాపురం శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి వార్షిక వసంతోత్సవాలు ఈ నెల 17 నుండి 19వ తేదీ వరకు నిర్వహించినట్లు టిటిడి అధికారులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 18న సాయంత్రం 6 నుండి రాత్రి 7 గంటల వరకు స్వర్ణ రథంపై శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ మాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిస్తారు. ఉత్సవర్లను ఆలయంలోని వసంత మండపానికి వేంచేపు చేసి ప్రతి రోజు మధ్యాహ్నం 2 నుండి సాయంత్రం 4 గంటల వరకు స్నపన తిరుమంజనం, సాయంత్రం ఊంజల్ సేవ, వీధి ఉత్సవం నిర్వహిస్తారు.

నేటి నుంచి ఏఐవైఎఫ్ జాతీయ మహాసభలు

- నేడు మహాప్రదర్శన, భారీ బహిరంగ సభ
- హాజరుకానున్న ప్రజాప్రతినిధులు, జాతీయ నాయకులు



ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో: తిరుపతి కేంద్రంగా ఆల్ ఇండియా యూత్ ఫెడరేషన్ జాతీయ మహాసభలు జరగనున్నాయి. గురువారం నుంచి ఈ మహాసభలు చారిత్రాత్మక, ఆధ్యాత్మిక తిరుపతి నగరంలో జరిపేందుకు ఏఐవైఎఫ్ నాయకులు, ఆహ్వాన సంఘం నేతలు సర్వసన్నద్ధమయ్యారు. ఆహ్వాన సంఘం చైర్మన్, సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ నేతృత్వంలో మహాసభలకు కావలసిన ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. గత 16వ ఏఐవైఎఫ్ జాతీయ మహాసభలను 2022 సంవత్సరంలో హైదరాబాద్ లో ఘనంగా నిర్వహించారు. 17వ మహాసభ తిరుపతిలో జాతీయ కార్యవర్గం నిర్ణయం మేరకు మహాసభలు నిర్వహించనున్నారు. ముందుగా అనుకున్న విధంగా ఈ నెల 15 నుంచి 18వ తేదీ వరకు నాలుగు రోజుల పాటు ఈ మహాసభలకు సన్నాహక ఏర్పాట్లు పూర్తయ్యాయి. దేశంలోని 24 రాష్ట్రాల నుంచి యువత ఈ కార్యక్రమంలో పాల్గొననున్నట్లు ఏఐవైఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి తిరుమలై రామన్ చెబుతున్నారు. నగరంలో ఇప్పటికే భారీ కటౌట్లను ఏర్పాటు చేశారు.

నేడు భారీ ప్రదర్శన, బహిరంగ సభ

ఏఐవైఎఫ్ జాతీయ మహాసభలు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో గురువారం తిరుపతి నగరంలోని బాలాజీ కాలనీ, నెహ్రూ మున్సిపల్ హైస్కూల్ మైదానం నుంచి ఎన్టీఆర్ సర్కిల్, గాంధీ రోడ్ , తిలక్ రోడ్డు మీదుగా తుడా సర్కిల్ లోని ఇందిరా మైదానం వరకు తొలతగా భారీ ప్రదర్శన నిర్వహించనున్నారు. సాయంత్రం నాలుగు గంటలకు ప్రారంభం అయ్యే ఈ ర్యాలీలో వేలాదిమంది యువకులు పాల్గొని తమ సమస్యలపై గళం విప్పనున్నారు.

తిరుపతికి రానున్న ముఖ్య నాయకులు

ఏఐవైఎఫ్ 17వ జాతీయ అధ్యక్షులు సుక్జింధర్ మహేషరి అధ్యక్షతన జరగనుంది. ఈ మహాసభలకు ముఖ్య అతిథులుగా మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా, మాజీ జాతీయ కార్యదర్శి కె.నారాయణ, మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాజ్యసభ సభ్యులు సంతోష్ కుమార్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే కె.రామకష్ణ, ఏఐవైఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి తిరుమలై రామన్, మాజీ జాతీయ కార్యదర్శి గుజ్జల ఈశ్వరయ్య, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పి.హరినాథరెడ్డి, ప్రముఖ సినీ సంగీత దర్శకులు వందేమాతరం శ్రీనివాస్, జాతీయ కార్యదర్శి లెనిన్ బాబు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పరుచూరి రాజేంద్రబాబు, రాష్ట్ర అధ్యక్షులు ఎం.యుగంధర్, స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ జి.సంతోష్ కుమార్ పాల్గొననున్నారు.

వడదెబ్బతో బలరాం మృతి



ప్రజాశక్తి - పుత్తూరు టౌన్: పట్టణంలోని పురపాలక సంఘం పరిధిలోని 20వ వార్డు నెత్తం గ్రామానికి చెందిన జి.బలరాం (68) వడదెబ్బ తగిలి పడిపోయాడు. వెంటనే ఆస్పత్రికి తరలించగా విరేచనాలతో మృతిచెందారు. బుధవారం విషయం తెలుసుకున్న నగరి ఎంఎల్ఎ గాలి భానుప్రకాష్ బలరాం మృతదేహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఇంటికి పెద్ద దిక్కు కోల్పోయిన వారి కుటుంబాన్ని టిడిపి ఆదుకుంటుందని తెలిపారు. ఆయన వెంట టిడిపి అధ్యక్షులు జీవరత్నం నాయుడు ఉన్నారు. బలరాం ప్రైవేట్ ఇన్‌స్టిట్యూట్‌లో వాచ్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్నారు. భార్య చిట్టెమ్మ, కూతురు జానకి, కొడుకులు నవీన్, అనీల్ ఉన్నారు.

గుండె పోటుతో వెల్డర్ మృతి

ప్రజాశక్తి -రామచంద్రాపురం: మండల కేంద్రంలో వెల్డింగ్ షాప్ నిర్వహిస్తున్న వెల్డర్ మహేష్(52) గుండె పోటుతో బుధవారం సాయంత్రం మృతి చెందాడు. తిరుపతి పల్లె వీధికి చెందిన వెల్డర్ మహేష్ రామచంద్రాపురం పెట్రోల్ బంక్ పక్కన వెల్డింగ్ షాప్ ఏర్పాటు చేసుకొని జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో బుధవారం సాయంత్రం షాపు వద్ద వెల్డింగ్ పని చేసుకుంటూ ఉండగా ఛాతి నొప్పి రావడంతో షాపు మూసివేసి ఇంటికి వెళ్లేందుకు బయలుదేరాడు. దాహం కావడంతో ఎదురుగా ఉన్న కూల్ డ్రింక్ షాప్ వద్దకు వెళ్లి సోడా తీసుకుని వచ్చి షాపు వద్ద మంచం మీద కూర్చుని తాగి పడిపోయాడు. స్థానికులు అక్కడికి వచ్చి మహేష్ ప్రాణాలు కాపాడేందుకు ప్రయత్నించినా ఫలించలేదు. 108 సిబ్బంది పరిశీలించి మహేష్ చనిపోయాడని తెలిపారు.

నియోజకవర్గ సమగ్ర అభివృద్ధే లక్ష్యం: ఎమ్మెల్యే


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

ప్రజాశక్తి- కేవీబీపురం: సత్యవేడు నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యమని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పేర్కొన్నారు. కేవీబీపురం మండలం కేంద్రంలోని కేజీబీవీ జూనియర్ కళాశాలలో సర్వశిక్ష అభియాన్ నిధులు రూ.1.27 కోట్లతో నిర్మించనున్న అదనపు తరగతి గదులకు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చొరవతో ప్రభుత్వ పాఠశాలలకు మహర్దశ కలుగుతోందన్నారు. పేద విద్యార్థినులు చదువు నిమిత్తం కస్తూర్బా జూనియర్ కళాశాలకు ఇంత పెద్ద మొత్తంలో (రూ.1.27 కోట్లు) నిధులు మంజూరు చేసిన మంత్రికి ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. గుత్తేదారు త్వరితగతిన పనులు పూర్తి చేస్తే విద్యార్థినులకు మెరుగైన వసతులు కల్పించవచ్చని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని అధికారులు, ప్రజాప్రతినిధులు, టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టెన్నిస్ దిగ్గజం లక్ష్మి సిరి దండు ప్రతిభ



బహుమతి సాధించిన లక్ష్మి సిరిదండు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : పాట్నాలో బుధవారం నిర్వహించిన ఖేలో ఇండియా టోర్నమెంటులో పాల్గొన్న తెలుగు రాష్ట్రాల ప్రముఖ టెన్నిస్ దిగ్గజం లక్ష్మి సిరి దండు బుధవారం ఉత్తమ ప్రతిభ చాటారు. టెన్నిస్ క్రీడలో సింగిల్స్ విభాగంలో పాల్గొని కాంస్య పతకం కైవసం చేసు కుంది. టెన్నిస్ క్రీడలో డబుల్స్ విభాగంలో పాల్గొని రజత పతకాన్ని సాధించింది. ఇప్పటికే జాతీయ టెన్నిస్ క్రీడల్లో రాణిస్తూ గూడూరు ఖ్యాతిని దేశమంతా వినిపిస్తోంది.

అభివృద్ధి పార్కును వెనక్కి తీసుకోవడం ఏంటి?

తుడ నిర్ణయంపై వైసిపి నాయకులు మునీశ్వర రెడ్డి ఆగ్రహం



ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): 'తుడా నిధులతో అభివృద్ధి చేసి ప్రజల వినియోగార్థం విడిచి పెట్టిన పార్కును వెనక్కు తీసుకోవడం ఏమిటని ఇది కక్ష సాధింపు చర్య కాదా?' అని తిరుపతి రూరల్ మండల వైసిపి అధ్యక్షులు మునీశ్వర రెడ్డి ప్రశ్నించారు. బుధవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో విలేకరులతో ఆయన మాట్లాడుతూ ప్రజా పరిపాలన వ్యవస్థలో జరిగే పద్ధతులను తెలిసి తెలియకుండా తిరుపతి రూరల్ మండలం టిడిపి అధ్యక్షులు మాట్లాడడం హాస్యాస్పదమన్నారు. పైగా తుమ్మలగుంట ప్రజలు వారి గ్రామానికి సంబంధించి సమస్యల పరిష్కారానికి సమావేశం ఏర్పాటుచేసి మాట్లాడుతుంటే చెవిరెడ్డి ఉలిక్కిపడ్డారని మీడియా ముందు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. గ్రామస్తుల సమస్యలు ఐక్యంగా వారు సమావేశమై మాట్లాడుకుంటే ఉలిక్కిపడ్డది టిడిపి వారే అన్నారు. తుడా విస్తరించిన నాలుగు నియోజకవర్గాల పరిధిలో ఇప్పటివరకు ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు తుడా నిధులతోనే చేపట్టిన పార్కులు, రిసెప్షన్ సెంటర్లు, మహిళా భవనాలు, యోగా జ్ఞాన మందిరాలు, కర్మ క్రియల నిర్మాణ సముదాయాలను ఆయా ప్రాంత పంచాయతీలు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్లకు ప్రజల వినియోగార్థం అందింఆచరన్నారు. తిరిగి వాటిని తుడ వెనక్కి తీసుకోవడం ఏమిటని ప్రశ్నించారు. దీన్ని కక్ష సాధింపుగానే పరిగణిస్తున్నామన్నారు. రూ.22 కోట్ల రూపాయలు నిధులకు సంబంధించి ఏదైనా సందేహాలు ఉంటే అధికారంలో ఉన్నవారు విజిలెన్స్ విచారణ చేయించుకోవచ్చని, దీనికి తాము, తుమ్మలగుంట గ్రామ ప్రజలు అడ్డురారన్నారు. మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డిపై నిందారోపణలు చేసిన టిడిపి రూరల్ మండల అధ్యక్షులు ఈశ్వర్ రెడ్డి మొదటగా తాను ఆక్రమించుకున్న భూమిని ప్రభుత్వానికి అప్పగించాలన్నారు. ఈ సమావేశంలో తిరుపతి ఎంపిపి మూలం చంద్రమోహన్ రెడ్డి, వైస్ ఎంపీపీ విడదల మాధవరెడ్డి, వెంకటపతి, నగర గ్రామ పంచాయతీ సర్పంచి చిన్నియాదవ్, కేశవులు, మోహన్ గౌడ్, వెంకటనారాయణ రెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా రథోత్సవం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పట్టణంలోని కరణాల వీధిలోని శ్రీ చెన్నకేశవ స్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. చెన్నకేశవ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళ వాయి ద్యాలతో పట్టణ పురవీధుల్లో రథోత్సవం వైభవంగా నిర్వహించారు. భక్తులు రథాన్ని లాక్కుని వెళ్లారు.

పోలీసుల పల్లెనిద్ర

ప్రజాశక్తి- రేణిగుంట: గుత్తివారి పల్లిలో పోలీసుల పల్లె నిద్ర కార్యక్రమం మంగళవారం రాత్రి జరిగింది. పల్లెవాసులకు చట్టాల పై రేణిగుంట ఎస్ఐ అరుణ్ కుమార్ అవగాహన కల్పించారు. సైబర్‌క్రైం ద్వారా ప్రజలు నష్టపోతున్న విధానాన్ని వివరించారు. చైల్డ్ ప్రొటెక్షన్ చట్టం గురించి, బాల్య వివా హాల గురించి, పర్యవ సానాల గురించి, మహిళల భద్రత, యువత ఏ విధంగా మత్తుకు బానిస అవుతున్నది వివరించా రు. వాహనదారులు పాటిం చాల్సిన నిబంధలను తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పిల్లలకు నోట్స్‌లు, స్కెచ్ పెన్నులు, పెన్నులు అందిం చారు. టిడిపి సీనియర్ నాయకులు మునిస్వామి నాయుడు, పద్మనాభరెడ్డి, ద్వారకనాయుడు, శోభన్‌బాబు పాల్గొన్నారు.



క్రైం న్యూస్

వ్యక్తి హత్య

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: ఓ వ్యక్తిని దారుణంగా హతమార్చి శ్మశానంలో పడేసిన సంఘటన శ్రీకాళహస్తిలో బుధవారం ఆలస్యంగా వెలుగు చూసింది. వన్ టౌన్ సీఐ గోపీ కథనం మేరకు.. స్థానిక శ్రీకాళహస్తీశ్వరాలయానికి సమీపంలో ఉన్న మరాఠా శ్మశాన వాటికలో ఓ గుర్తు తెలియని వ్యక్తి(43) మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఆ మేరకు ఘటనా స్థలానికి వెళ్లి విచారణ చేపట్టిన పోలీసులు దొరికిన ఆధారాలతో వ్యక్తి హత్యకు గురయ్యాడని గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు. మృతదేహం పడి ఉన్న తీరు, కత్తి గాట్లను పరిశీలిస్తే నాలుగు రోజుల క్రితం హత్యకు గురై వుండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. మృతుడి ఆచూకీ తెలిసినవారు సెల్ : 9440796762, 9440796761 నెంబర్లకు సమాచారం అందించాలని కోరారు.

ట్రావెల్ బస్సు బోల్తా

20 మందికి గాయాలు


ప్రమాదానికి గురైన ట్రావెల్ బస్

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి రూరల్: ట్రావెల్ బస్సు బోల్తా పడి 20 మందికి యాత్రికులకు గాయాలైన సంఘటన బుధవారం తెల్లవారుజామున మండలంలోని ల్యాంకో పరిశ్రమ సమీపంలో మదనపల్లి–నాయుడు పేట జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. బెంగళూరుకు చెందిన రవిశెట్టి కుటుంబం తిరుపతి జిల్లా విహార యాత్ర నిమిత్తం ఓ ప్రైవేట్ ట్రావెల్ బస్సును అద్దెకి తీసుకున్నారు. మంగళవారం తిరుపతిలో బస చేశారు. బుధవారం శ్రీకాళహస్తికి వస్తుండగా ల్యాంకో పరిశ్రమ సమీపంలో బస్సు బోల్తా పడింది. ఈ ఘటనలో 20 మంది గాయపడ్డారు. గాయపడ్డ వారిలో రేష్మ శెట్టి (38), రవిశెట్టి (48), వేణుగోపాల్ (42), మంజుల (36), సుజలాశెట్టి (66), గార్విశెట్టి(13), ఊసప్ప గౌడ (70), మధుబాబు (46), మృద్విశెట్టి (6), విహాన్ (8), పురవ్ (15)లు ఉన్నారు. క్షతగాత్రు లను చికిత్స నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రవి నాయక్ తెలిపారు.

ఆగి ఉన్న లారీని ఢీకొన్న కోళ్ల లారీ

ఇద్దరు మృతి

ప్రజాశక్తి -ఏర్పేడు : ఆగి వున్న లారీని కోళ్ల లారీ ఢీకొన్న ప్రమాదంలో కోళ్ల లారీలో ప్రయాణిస్తున్న ఇద్దరు మృతి చెందిన సంఘటన మండలంలో బుధవారం చోటుచేసుకుంది. మంగంపేట నుండి నెల్లూరు పోర్ట్‌కు వెళుతూ పూతలపట్టు– నాయుడుపేట జాతీయ రహదారిపై టోల్ ప్లాజాకి అతి సమీపంలో మేర్లపాక వద్ద రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీని ధర్మాపురం నుండి శ్రీకాకుళం వెళుతున్న కోళ్ల లారీ వెనుక నుండి ఢీకొంది. ఈ ప్రమాదంలో ధర్మపురికి చెందిన కృష్ణన్ (55), పెరుమాల్ (40) మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. సంఘటన స్థలానికి చేరుకున్న ఏర్పేడు పోలీసు సిబ్బంది మృతదేహాలను అతి కష్టంతో వ్యాన్ నుండి వెలికి తీసి శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ షాక్‌తో మహిళ మృతి


విద్యుత్ షాక్‌తో మృతి చెందిన సీతమ్మ

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: ఇంట్లో సెల్‌ఫోనుకు చార్జింగ్ పెడుతూ ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై ఓ మహిళ మృతి చెందిన ఘటన బుధవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు..బీహార్‌కు చెందిన వలస కూలి సీతమ్మ (40) మంగళం సమీపంలోని తిమ్మినాయుడుపాలెం సుఖీ బాలాజీ కాలనీలో నివసిస్తోంది. బుధవారం సెల్ ఫోన్‌కు ఛార్జింగ్ పెట్టేందుకు ఆమె ప్రయత్నించడంతో ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురయ్యారు. కుటుంబ సభ్యులు హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. ఆమె అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. పోస్టుమార్టం నిమిత్తం పోలీసులు మృతదేహాన్ని తిరుపతి రుయా మార్చురీకి తరలించారు. అలిపిరి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆలయంలో చోరీ

ప్రజాశక్తి-సత్యవేడు: సత్యవేడు పట్టణంలోని ఓ ఆలయంలో హుండీ చోరీకి గురైంది. నాగాలమ్మ సదవాలమ్మ ఆలయంలోని విగ్రహాలను ధ్వంసం చేసి హుండీలోని నగదు, త్రిశూలాన్ని అపహరించారని ఆలయ కమిటీ సభ్యులు బుధవారం మీడియాకు తెలిపారు. ఆలయ సీసీ కెమెరాలో నిక్షిప్తమైన వీడియో ఆధారంగా ఆలయ కమిటీ సభ్యులు ఇచ్చిన సమాచారం మేరకు సీసీ కెమెరాల ఆధారంగా దొంగను ఆలయ కమిటీ సభ్యులు గుర్తించినట్లు తెలిపారు. ఈ మేరకు కమిటీ సభ్యులు సీఐ మురళికి ఫిర్యాదు అందించారు.


వివాహిత ఆత్మహత్య

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు రూరల్ పరిధిలోని స్థానిక టిడ్కో గృహాల వద్ద ఓ వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన చోటు చేసుకుంది. గూడూరు రూరల్ ఎస్ఐ మనోజ్ కుమార్ కథనం మేరకు మనుబోలు గ్రామానికి చెందిన గుణపాటి హేమలత (27) తన భర్తతో ఘర్షణ పడి కురుగొండ గ్రామానికి చెందిన రషీద్‌తో సహజీవనం చేస్తోందన్నారు. వారిద్దరు 15 రోజుల నుండి గూడూరు టిడ్కో అపార్టుమెంటులో బాడుగకు తీసుకొని జీవనం సాగిస్తున్నారన్నారు. మృతురాలు ఈనెల 13 వ తేదిన రషీద్‌తో 'నువ్వు నీ భార్య వద్దకు వెళ్లొదు..' అని వారించింది. రషీద్ వెళ్లడంతో మృతురాలు మనస్థాపం చెంది ఇంట్లో చీరతో ఉరివేసుకుని మృతి చెందిందని తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహం లభ్యం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : స్థానిక సాయిబాబాగుడి సమీపంలోని చెరువుకట్ట వద్ద బుధవారం రాత్రి ఓ గుర్తు తెలియని వృద్ధుడు మృతదేహం లభ్యమైన సంఘటన చోటు చేసుకుంది. రూరల్ ఎస్ఐ మనోజ్ కుమార్ కథనం మేరకు..స్థానిక సాయిబాబాగుడి సమీపంలోని చెరువుకట్ట వద్ద 55 ఏళ్లకు పైబడిన గుర్తుతెలియని వృద్ధుడు మృతి చెంది ఉండటాన్ని స్థా నికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారన్నారు. మృతుడు తెల్ల చొక్కా, గళ్ల లుంగీ ధరించి ఉన్నాడన్నారు. సంఘటనా స్థలాన్ని డీఎస్పీ గీతాకుమారి పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భవనం పై నుంచి పడి వలస కూలీ మృతి


మృతుడు రవీంద్ర కట్వర్

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: భవనంపై నుంచి పడి వలస కూలీ మృతి చెందిన ఘటన బుధవారం తిరుపతిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు ఒరిస్సా రాష్ట్రానికి చెందిన రవీంద్ర కట్వర్ (42) టీటీడీ ప్రెస్ బిల్డింగ్ వెనుక నిర్మిస్తున్న కొత్త భవనం వద్ద భవన నిర్మాణ పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు మూడవ అంతస్తు నుండి రెండవ అంతస్తుకు పడిపోయాడు. తోటి స్నేహితులు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ కొద్దిసేపటికే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రుయా మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.